ఎమ్మెల్సీ కవిత పుట్టిన రోజు సందర్భంగా గురువారం కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసినవారిలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, తెలంగాణ జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ జాగృతి షాద్‌నగర్ నియోజకవర్గ మాజీ కన్వీనర్ ఎండీ ముస్తఫా గణేశ్ ఉన్నారు. – కడ్తాల్/షాద్‌నగర్, మార్చి 13

తుంకిమెట్లలో అటో డ్రైవర్ల నిరసన

ఆటో డ్రైవర్ల నిరసన

బొంరాస్‌పేట, మార్చి 13 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం ఉండడం వల్ల ఆటోలకు గిరాకీ పూర్తిగా పడిపోయి ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోతున్నారని సీఐటీయూ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. గురువారం బొంరాస్‌పేట మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిరసన చేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోల గిరాకీ పూర్తిగా పడిపోయిందని, దీంతో ఆటో వాలాల కుటుంబాలు ఆగమాగమయ్యాయన్నారు. నెలనెలా ఆటోల ఫైనాన్స్ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ప్రతి నెలా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

మెరుగైన వైద్యం అందించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పూడూరు దవాఖానలో సమస్యలపై సిబ్బంది ద్వారా తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పూడూరు, మార్చి 13 : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. గురువారం పూడూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానకు వచ్చే వారి రికార్డులతో పాటు మందుల నిల్వ గది, లాబొరేటరీ గదులు, సిబ్బంది రికార్డులను పరిశీలించారు. దవాఖాన భవన మరమ్మతుల పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. దవాఖానలో అవసరాలకు అనుగుణంగా లైట్లను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరీక్షలు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ ప్రాంత ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచు కోవాలని చెప్పారు. అవసరమైన మందుల లోటు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని తెలిపారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, తహసీల్దార్ భరత్‌కుమార్‌గౌడ్, డాక్టర్ దేవికారెడ్డి, ఫార్మాసిస్ట్, సిబ్బంది ఉన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలి

జిల్లా ఎన్‌సీడీ సమన్వయకర్త రేణుకుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్‌సీడీ సమన్వయకర్త రేణుకుమార్

ధారూరు, మార్చి 13 : ఎన్‌సీడీ స్పెషల్ డ్రైవ్‌లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా ఎన్‌సీడీ సమన్వయకర్త రేణుకుమార్ అన్నారు. గురువారం ధారూరు మండల పరిధిలోని నాగసముందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో, ఎన్‌సీడీ అధికారుల ఆదేశానుసారం ఎంఎల్‌హెచ్‌పీ, సూపర్‌వైజర్లు, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకుమార్ మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్‌లో అధిక రక్తపోటు, మధుమేహంపై ప్రత్యేకంగా నిర్వహించిన క్యాంపులలో గుర్తించి వాటిని నమోదు చేయాలన్నారు. 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స చేసి అన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగసముందర్ పీహెచ్‌సీ డాక్టర్ మాధవి ఉన్నారు.

ఉపాధిహామీ ప్రజావేదికలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత

షాబాద్, మార్చి 13 : గ్రామాల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత అన్నారు. గురువారం షాబాద్‌లోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో గతేడాది నిర్వహించిన ఉపాధి హామీ పథకంలో కూలీలకు చెల్లించిన వేతనాలు, పనుల నాణ్యత, ఇతర పనుల సమగ్ర వివరాలపై సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని సూచించారు. కూలీలు చేస్తున్న పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి కూలీ వంద రోజులు పని చేసేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతుల పొలం గట్లపై నాటిన మొక్కలను ఎండిపోకుండా, మంటలకు కాల్చివేయకుండా చూసుకోవాలని తెలిపారు. మొక్కలను కాల్చివేసే వారికి షోకాజ్ నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు డబ్బులు అందించే విషయంలో ఆలస్యం జరుగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, ఏపీడీ చరణ్‌గౌతమ్, ఏపీవో కొండయ్య, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరాసింగ్, ఎస్ఆర్‌పీ రంజిత్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చెప్పులు చోరీ

మలక్‌పేట, మార్చి 13 : దొంగతనానికి కాదేది అనర్హం అనర్హమన్నట్లు.. అర్ధరాత్రి ఓ అపార్ట్‌మెంట్లోకి చొరబడిన దొంగలు.. నాలుగు ఫ్లాట్ల ముందున్న 30 జతల బూట్లు, 25 జతల చెప్పులను దొంగిలించుకుపోయారు. ఈ ఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈస్ట్ ప్రశాంత్‌నగర్ లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి ఈస్ట్ ప్రశాంత్ నగర్‌లోని మైక్రో హెల్త్ కేర్ అపార్ట్ మెంట్లోకి వచ్చిన దొంగలు.. పాదరక్షలను చోరీ చేసి ఆటోలో వేసుకుని పరారయ్యారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. అపార్ట్‌మెంట్ వాసి మహబూబ్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దొంగలను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

వైన్ షాపులో చోరీ

అడ్డువచ్చిన యువకుడి హత్య

హత్యకు గురైన యువకుడు భిక్షపతి(ఫైల్)

షాబాద్, మార్చి 13 : గుర్తుతెలియని వ్యక్తులు వైన్ షాపులో చోరీకి పాల్పడి, అడ్డువచ్చిన యువకుడిని హత్య చేసిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. షాబాద్‌లోని దుర్గా వైన్స్ షాపు పక్కన ఉన్న కూల్ పాయింట్‌లో షాబాద్ గ్రామానికి చెందిన చేగూరి భిక్షపతి అలియాస్ ప్రవీణ్(35) పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి పని ముగించుకుని ఎప్పటిలాగానే వైన్ షాపు పక్కన పర్మిట్ రూమ్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వైన్ షాపులో దొంగతనానికి పాల్పడ్డాడు. వైన్ షాపు వెనకాల గోడను పగులగొట్టి రంధ్రం చేసి షాపులోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.40వేల నగదుతో పాటు మద్యం బాటిళ్లు, సీసీ కెమెరా డివైజ్‌ను ఎత్తుకెళ్తుండగా భిక్షపతి గమనించి అడ్డుపడ్డాడు. దీంతో దుండగులు అతడి తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని గురువారం ఉదయం చేవెళ్ల ఏసీపీ కిషన్, క్రైమ్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, సీసీఎస్, ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, రమణారెడ్డి డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ బృందం దుండగుల అనవాళ్ల కోసం వివరాలు సేకరించారు. దుండగులను పట్టుకునేందుకు పోలీసులు ఆయా ప్రదేశాల్లో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. వారం రోజుల క్రితమే నాగరగూడ వైన్స్‌లో దొంగతనం జరిగిన ఘటన మరువకముందే షాబాద్ వైన్స్‌లో చోరీ జరిగింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైన్ షాపుకు వెనుకభాగంలో గోడకు రంధ్రం చేసి దొంగతనానికి పాల్పడిన దుండగులు

సీఎంఆర్ ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి అప్పజెప్పాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 13 : ఖరీఫ్ 2024-25కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీఎంఆర్ డెలివరీ చేయనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యాన్ని పక్కదారి పట్టించినవారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఖరీఫ్ 2024-25 సీజన్‌లో పాల్గొన్న మిల్లర్లందరూ వరిధాన్యానికి తప్పని సరిగా బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాల్సిందిగా ఆదేశాలిచ్చారు. బ్యాంక్ గ్యారంటీ ఇవ్వనివారికి తదుపరి సీజన్‌లో వరిధాన్యం అలాట్‌మెంట్ చేయబడదని తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, డీఎం వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్ల సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గుప్తా, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు

బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు చేపడతామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఫారం 6, 7, 8 పెండింగ్, రాజకీయ పార్టీల సమావేశాలు, బూతు స్థాయి ఏజెంట్ నియామకం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మార్చి 19లోగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫారం 6, 7, 8 పెండింగ్‌లను మార్చి 21లోపు పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేహమత్ అలీ పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

నిర్మాణదారుల్లో ఆందోళన

అధికారుల తీరుపై విమర్శలు

ఈ నెల 10 నుంచే అందుబాటులోకి తెస్తామన్న కమిషనర్

బిల్డ్ నౌ సమస్యలు!

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): నిర్మాణ రంగ అనుమతులు మరింత సులభతరం చేస్తూ 'బిల్డ్ నౌ' విధానాన్ని అమలు చేయబోతున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన బల్దియా.. ఆచరణలో అపసోపాలు పడుతున్నది. ప్రస్తుతం అమలవుతున్న టీజీబీపాస్ మించి తక్కువ సమయంలో ఇంటి నిర్మాణ అనుమతులు పొందవచ్చని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ రూపొందించిన బిల్డ్ నౌతో అనుమతుల జారీలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు హడావుడి చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బిల్డ్ నౌ అప్‌లోడ్ చేసే విధానంపై ఆర్కిటెక్ట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంతేకాకుండా ఈ నూతన విధానంపై జోనల్, డిప్యూటీ కమిషనర్లకు అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 10 నుంచి బిల్డ్ నౌ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని స్వయంగా కమిషనర్ ఇలంబర్తి ప్రకటించారు. 14వ తేదీ వచ్చినా.. బిల్డ్ నౌ పై మౌనంగా ఉన్నారు. ప్రారంభ సమయంలో భాగంగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, గడిచిన రెండు రోజులుగా సదరు సాఫ్ట్‌వేర్ నిపుణులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. బిల్డ్ నౌ విధాన అమలులో మరింత ఆలస్యం కానుందని టౌన్‌ప్లానింగ్ వర్గాలు తెలిపాయి. మొత్తంగా ఆదిలోనే ఆధునిక విధానం అపసోపాలు పడుతుండడంపై నిర్మాణదారుల్లో ఆందోళన నెలకొంది.

15 రోజుల్లోనే అనుమతి..

టీజీబీపాస్‌తో నిర్మాణ రంగ అనుమతి గరిష్ఠంగా 21 రోజుల సమయం పడుతుందని, బిల్డ్ నౌ విధానం అమల్లోకి వస్తే ఇంటి అనుమతి 15 రోజుల్లోపే లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు సమయంలో ఉన్న లోపాలను గుర్తిస్తుందని, ప్లాన్ మొదటి నుంచి పరిశీలించాల్సిన అవసరం ఉండదని, గుర్తించిన అంశాన్నే సవరించి అప్‌లోడ్ చేసే వెసులుబాటు ఉందని చెప్పారు. అప్లికేషన్ పరిశీలన చేసే సందర్భంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారంగా ప్లాన్ చెరువు పక్కన ఎంత దూరంలో ఉంది? కోర్టు కేసులు ఉన్నాయా? అప్లికేషన్‌లోనే పొందుపరుస్తారని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి తొందరగా సంబంధిత అనుమతి ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు.

75 గజాల లోపు ఉంటే..

ఇంటి స్థలం విస్తీర్ణం 75 గజాల లోపు ఉంటే దరఖాస్తు చేసుకోగానే అనుమతి వచ్చేస్తుందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌లు రూపొందించే డ్రాయింగే ప్రామాణికం. ప్రస్తుత వ్యవస్థలో డ్రాయింగ్ పరిశీలనకు కొన్ని వారాల సమయం పడుతోందని.. ఇది కాస్తా నిమిషాల్లో తగ్గనుందని చెప్పిన అధికారులు.. ఆచరణలో మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించకలేక పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నిర్మాణ రంగం కుదేలవుతున్న తరుణంలో కొత్త ప్రయోగాలు ఏ మేర సత్ఫలితాలిస్తాయోనన్న ఆందోళనలో నెలకొన్నది.

జిల్లాలో మండలు ఎండిపోతున్న నేపథ్యంలో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. పశువుల కాపరి ఓ బోరు పంపును కొడుతుండగా తమ దాహార్తిని తీర్చుకుంటున్న మేకలు

జల్‌పల్లి పెద్దచెరువు కబ్జాకు యత్నం

- మట్టి పోస్తున్న ఆక్రమణదారులు.. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏఈ

జల్‌పల్లి పెద్ద చెరువు పరీవాహక ప్రాంతంలో పోసిన మట్టి కుప్పలు

పహాడీషరీఫ్, మార్చి 13 : పల్లెల్లోని నీటి వనరులపై భూ బకాసురులు కన్నేశారు. చెరువులను సొంతం చేసుకోవాలని పావులు కదుపుతున్నారు. రాత్రికిరాత్రి చెరువు పూడ్చేందుకు కుట్ర పన్నుతున్నారు. జల్‌పల్లి గ్రామంలో అతిపెద్ద తాగునీటి వనరైన పెద్ద చెరువుపై కబ్జారాయుళ్ల కన్ను పడింది. ఫిరంగి నాలా కనుమరుగు కావడంతో చారిత్రక ఆనవాళ్లు కలిగిన పెద్ద చెరువు సైతం క్రమేణా అక్రమణలకు గురవుతూ వస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద చెరువు కబ్జా కాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ నాయకుల అండదండలతో ఆక్రమణదారులు తిరిగి తమ వ్యవహారాలను చక్కదిద్దుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో పెద్ద చెరువు పరీవాహక ప్రాంతాల్లో టిప్పర్ల ద్వారా మట్టిని తెచ్చి కుప్పలుగా పోస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఇరిగేషన్ ఏఈ వీరేందర్‌కుమార్ వెంటనే స్పందించారు. చెరువును పూడ్చేందుకు మట్టిని తరలించిన వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని గురువారం ఏఈ పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శివగంగా కాలనీలో పార్కు స్థలం పరిశీలన

మన్సూరాబాద్, మార్చి 13: హయత్‌నగర్ పరిధి శివగంగా కాలనీలోని పార్కు స్థలం కబ్జాకు గురయ్యిందంటూ కొందరు కాలనీవాసులు ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం హైడ్రా అధికారి బాచిరెడ్డి పార్కు స్థలాన్ని పరిశీలించారు. కాలనీ అధ్యక్షుడు తొంట బాబు గత నెల 15న శివగంగా కాలనీ పార్కు స్థలం కబ్జాకు గురవుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. పార్కు స్థలం కబ్జా గురైన డాక్యుమెంట్లను, లేఅవుట్‌ను కాలనీవాసులు అందజేశారు. సుమారు 153 గజాల స్థలం కబ్జాకు గురైందని బహిరంగ మార్కెట్‌లో దీని విలువ కోటి రూపాయలకు పైగా ఉంటుందని కాలనీవాసులు తెలిపారు. కబ్జాదారుడు తమ కాలనీ పేరుతో తప్పుడు లెటర్ ప్యాడ్ సృష్టించి కాలనీ అధ్యక్షుడిని తానేనని అధికారులను మభ్యపెడుతున్నాడని వారు హైడ్రా అధికారికి వివరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు నకిరేకంటి వెంకటేశ్‌గౌడ్, సతీశ్‌రెడ్డి, నరసింహ యాదశ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- రసాయన రంగులు ప్రమాదకరం.. సంప్రదాయ రంగులే సేఫ్..
- పండుగ నిర్వహణకు రిసార్టులు, గేటెడ్ కమ్యూనిటీల్లో జోరుగా ఏర్పాట్లు
- రంగులు చల్లుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు

రంగుల కేళీ.. హోలీ

నిమ్మ, కుంకుమపువ్వు, పసుపు, బిల్వాలతో సహజ రంగులను తయారుచేసి హోలీ ఆడేవారు. కాలక్రమేణా రసాయనాలతో తయారు చేసిన రంగుల వాడకం పెరిగి సహజ రంగుల వాడకం తగ్గింది. రసాయన రంగులతో ఈ పండుగ ఎంత ఉల్లాసాన్ని నింపుతుందో.. అంతే విషాదాన్ని మిగుల్చుతుంది.

రంగుల్లో వాడే రసాయన పదార్థాలతో శరీరానికి హాని కలిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కళ్లమంటలు, ఆస్తమా, చర్మ వ్యాధులు సంభవిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నలుపు రంగులో లెడ్ ఆక్సైడ్ ఉంటుందని, ఇది మూత్రపిండాలను పాడు చేస్తుందని, వెండి రంగులో ఉండే మెర్క్యూరీ సల్ఫేట్‌తో క్యాన్సర్ సోకే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఆకుపచ్చ రంగుల్లో ఉండే కాపర్ సల్ఫేట్ ద్వారా ఎలర్జీతో పాటు శాశ్వత అంధత్వం వచ్చే అవకాశం ఉంది. పొడిగా ఉండే రంగుల్లో జిలెటిన్‌పైలట్ కలవడం వల్ల మైకంతో పాటు ఆస్తమా, అంధత్వం వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. అందుకాపర్ వల్ల హోలీ పండుగలో రసాయన రంగులకు బదులు సహజ రంగులు వాడటం ఎంతో శ్రేయస్కరం.

పసుపుతో చేసిన రంగులు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. తులసి ఆకులతో చేసిన రంగులు మానసికోల్లాసానికి తోడ్పడతాయి. శ్వాసక్రియ శక్తిని పెంచుతాయి. కలబంద, వేపాకులు చర్మ వ్యాధులను తగ్గిస్తాయి. దురదల నివారణకు ఉపయోగపడతాయి. గోరింటాకు శరీర పగుళ్లను నివారిస్తుంది. గంధం పొడి మనసుకు ప్రశాంతత కలిగించడంతో పాటు సువాసన వెదజల్లుతుంది.

రసాయన రంగులతో చర్మ వ్యాధులు

వసంతకాలం వాతావరణంలో చోటుచేసుకునే మార్పులతో వ్యాధులు ప్రబలుతాయి. ఈ సమయంలో సహజసిద్ధమైన రంగులు శరీరానికి ఔషధంలా పనిచేస్తాయి. పూర్వం నిమ్మ, కుంకుమపువ్వు, పసుపు, బిల్వాలతో సహజ రంగులను తయారుచేసి హోలీ ఆడేవారు. కాలక్రమేణా రసాయనాలతో తయారు చేసిన రంగుల వాడకం పెరిగి సహజ రంగుల వాడకం తగ్గింది. రసాయన రంగులతో ఈ పండుగ ఎంత ఉల్లాసాన్ని నింపుతుందో.. అంతే విషాదాన్ని మిగుల్చుతుంది.

సహజ రంగుల తయారీ విధానం

* పసుపు, కుంకుమ, పూలు, పండ్లు వివిధ రకాల పిండిని నీటిలో కలిపి ఉపయోగించుకోవచ్చు.
* మోదుగు పూలను ఉడకబెట్టి సహజసిద్ధమైన రంగు తయారు చేసుకుని వాడవచ్చు.
* గంధం, ఎర్ర మందారం, గోగుపూలు, దానిమ్మతొక్క, టమాట, క్యారెట్, పసుపు, సున్నం, మిశ్రమం కలిస్తే ఎరుపు రంగు వస్తుంది.
* శనగపిండి, పసుపు మిశ్రమం, బంతి, చామంతిపూల మిశ్రమంతో పసుపు రంగు వస్తుంది.
* గోరింటాకు, గుల్‌మొహర్ ఆకులు, గోధుమ మొలకలు, పాలకూర, కొత్తిమీర, పుదీనాతో ఆకుపచ్చ రంగు తయారుచేసుకోవచ్చు.
* ఇండిగో ప్లాంట్ (సిరాచెట్టు) కాయలతో నీలి రంగు తయారుచేసుకోవచ్చు.
* బీట్‌రూట్, ఉల్లిపాయ తొక్కల మిశ్రమంతో ముదురుకెంపు రంగు వస్తుంది. పారిజాత పూల కాండాలను ఎండబెట్టి నానబెడితే సింధూరం రంగు వస్తుంది.
* బ్రౌన్ కలర్ కోసం కాఫీ లేదా టీ పొడి కలిపి వడపోసిన నీళ్లు లేదా మరగబెట్టిన నీళ్లు ఉపయోగించుకోవచ్చు.
* నల్ల ద్రాక్ష రసం లేదా ఎండబెట్టిన పెద్ద ఉసిరికాయలను ఉడికించి రాత్రంతా అలా వదిలేసి మరునాడు నీటిలో కలిపితే నలుపురంగు తయారవుతుంది. ఎర్ర చందనాన్ని నీటిలో కలిపి ఎరుపు రంగు పొందవచ్చును. గోరింటాకును రుబ్బి పిండిలో కలిపితే ఆకుపచ్చ రంగును తయారు చేసుకోవచ్చు.
* రెండు చెంచాల గంధపు పొడిని లీటర్ నీటిలో కలిపి మరగబెడితే ఎరుపురంగు ద్రావణం తయారు చేసుకోవచ్చు.
* నీలి మందును నీటిలో కలిపితే నీలి రంగు వస్తుంది.
* తులసి, వేప, కలబంద కలిపి నూరి నీటిలో కలిపితే ముదురు ఆకుపచ్చ వర్ణం వస్తుంది.

కులమతాలకతీతంగా అందరూ జరుపుకొనే పండుగ హోలీ. వేడుకల కోసం నగర శివారుల్లోలని పలు రిసార్టులు, ఫామ్‌హౌస్‌లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అంతా కలిసి ఒకే చోట హోలీ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. ఖర్చు ఎక్కువయినా వెనుకాడటంలేదు. రెయిన్ డ్యాన్సులు, డీజేలు తప్పనిసరిగా చేసుకుంటున్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రత్యేకంగా ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ పండుగపూట రసాయన రంగులు వాడి రోగాలు కొనితెచ్చుకోకుండా సహజసిద్ధంగా లభించే మందులను వాడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రంగులు చల్లుకునే సమయంలో కండ్లు, ముక్కు, నోట్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలంటున్నారు.

- ఇబ్రహీంపట్నం/పెద్దఅంబర్‌పేట, మార్చి 13

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

* రసాయన మందులతో కళ్లకు హాని కలగకుండా సన్‌గ్లాసెస్ వాడాలి. దంతాలపై రంగులు పడకుండా డెంటల్ క్యాప్స్ వేసుకోవాలి.
* హోలీ వేడుకల్లో మందపాటి పాత దుస్తులు ధరించాలి.
* ముదురు రంగు దుస్తులు మంచిది. ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, చేతులకు గ్లౌజ్‌లు, కాళ్లకు సాక్సులు వేసుకోవాలి.
* కళ్లల్లో రంగు పడితే వెంటనే చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. మంట అనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి.
* తలపై రంగులు పడకుండా క్యాప్ పెట్టుకోవాలి. రంగులు చల్లుకోవడం పూర్తయ్యాక గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.